


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JULY - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship at Kakinada

**తేదీలు** : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

**సమయం** : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

**స్థలం** : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్
**కాకినాడ**

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

**Cell : 92474-56270**
0884-2363722

**వందనములతో**
**లక్ష్మి గూటంగారు**
**జాషువా గూటంగారు**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | జూలై 2008 | సంచిక 12


## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 4
## (Jesus Christ, the son of God - 4)

యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఎందుకు నమ్ముదురో తెలిసికొనియున్నాము. సత్యవాక్కు చదివి యేసుక్రీస్తు నందు విశ్వాసాన్ని వెల్లడి పర్చుచూ అనేకులు మాకు వ్రాసారు. వారికి మా హృదయపూర్వక వందనములు. ఇంతవరకు యేసును గూర్చి మనము నేర్చుకొనిన కొన్ని సత్యాలను ఇప్పుడు మనము జ్ఞప్తికి తెచ్చుకొందాము.

యేసు కన్యయైన ఒక స్త్రీకి దేవుని వలన జన్మించెను. అందువలన ఆయన జన్మించిన రీతిని బట్టి దేవుని అద్వితీయ కుమారుడాయెను. ఆయనే దేవుని కుమారుడు అని యేసును ఎరిగిన అనేకులు ఇచ్చిన సాక్ష్యమును బట్టి మనము ఆయన యందు విశ్వాసముంచగలము. అంతేకాదు, యేసుక్రీస్తు యొక్క జనన, జీవన, మరణ పునరుత్థానములను గూర్చి వందలకొలది సం॥లకు ముందే చెప్పబడిన ప్రవచనము లనేకములు

యేసుక్రీస్తులో అక్షరాల నెరవేరెను. గనుక ఆయనే దేవుని కుమారుడు, ఆయనే దేవుడు అని మనము ఒప్పుకొనక తప్పదు.

**ఆయన చేసిన అద్భుతములు**

యేసు దేవుని యొక్క ఏకైక కుమారుడని మనము నమ్మునిమిత్తము మనకు ఇంకొక ఆధారమున్నది. ఆయన ఈ లోకములో చేసిన అద్భుతములే. అయితే ఆ అద్భుతములలో కొన్నింటిని ఈ రోజు మనము పరిశీలించుదాము. భూమి పై ఏ మానవుడు ఎన్నడు చేయలేని అద్భుత కార్యములను చూచిన జనసమూహములు ఆయనే దేవుని కుమారుడని ఒప్పుకొనక తప్పలేదు. ఆయన దేవుని కుమారుడు కానియెడల అట్టిమహత్కార్యములనెట్లు చేయగలడు? మత్తయి, మార్కు లూకా, యోహాను అనువారు యేసు చేసిన అద్భుత కార్యములలో కొన్నింటిని క్రొత్తనిబంధన గ్రంథములో మనకు వ్రాసియిచ్చారు. వారు వ్రాసిన సాక్ష్యమును మనము చదువుచుండగా యేసు చేసిన మహత్కార్యములు, సూచక క్రియలు ఆయనే దేవుని కుమారుడని సూచించుచున్నవి. ఆయన చేసిన అద్భుతములలో 41ని గూర్చి క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు సువార్తలు మనకు తెలియ జెప్పుచున్నవి. అయితే "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంధములకు భూలోకమైనను చాలదని" భక్తుడైన యోహాను సాక్ష్యము పలికెను (యోహాను 21:25).

**రోగులను స్వస్థపరచెను**

యేసుక్రీస్తు గ్రుడ్డి వారికి చూపునిచ్చెను. కుంటివారికి నడువ శక్తినిచ్చెను. కుష్ఠరోగులను శుద్ధులనుగా చేసెను. చెవిటి వారికి వినుటకు శక్తినిచ్చెను. చనిపోయిన వారిని లేవదీసెను. మనుష్యులకున్న ప్రతివిధమైన రోగములను మాట చెప్పి బాగుచేసెను. దయ్యములను వెళ్ళగొట్టెను. నీళ్ళమీద నడచెను. గాలిని తుఫానును ఆయన గద్దించగా అవి నిమ్మళమాయెను వేలకొలది ప్రజలకు ఆయన అద్భుతరీతిగా ఆహారమునిచ్చెను. ఆయన చనిపోయి సమాధి చేయ బడినను మృత్యువును తనకు తానే గెలిచిలేచెను. అందువలన ఆయన దేవుని కుమారుడని

మహిమా ప్రభావముతో నిరూపింపబడెను (రోమా 1:4).

గలిలయలోని కానా యను ఊరిలో ఒక వివాహము జరిగెను. యేసు తల్లి అక్కడ ఉండెను; యేసును, ఆయన శిష్యులును ఆ వివాహమునకు పిలువ బడిరి. ఆ వివాహమందు నీళ్ళను ద్రాక్షారసముగా మార్చి యేసు తన మహిమను బయలుపరచెను. యేసు చేసిన సూచకక్రియలలో ఇది మొదటిది; అందువలన ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాసముంచిరి (యోహాను 2:1-11).

కపెర్నహూము అను ఊరిలో ఒక ప్రధాని కుమారుడు రోగియైయుండెను. యేసు గలిలయకు వచ్చెనని ఆ ప్రధాని విని ఆయన యొద్దకు వెళ్ళి తన కుమారుడు చావ సిద్ధమై యుండెను గనుక ఆయన వచ్చి అతని స్వస్థపరచవలెనని వేడు కొనెను. యేసు నీవు వెళ్ళుము. నీ కుమారుడు బ్రదికి యున్నాడని అతనితో చెప్పగా ఆ మనుష్యుడు యేసు తనతో చెప్పిన మాట నమ్మి వెళ్లిపోయెను. అతడింక వెళ్ళుచుండగా అతని దాసులు ఎదురుగా వచ్చి అతని కుమారుడు బ్రతికియున్నాడని తెలియజెప్పిరి. నీ కుమారుడు బ్రతికి యున్నాడని యేసు తనతో చెప్పిన ఘడియయందే అది జరిగెనని అతడు కనుగొనెను గనుక అతడును అతని యింటి వారందరును యేసునందు నమ్మిరి (యోహాను 4:46-54).

ఒకసారి కుష్ఠరోగి ఒకడు వచ్చి యేసునకు మ్రొక్కి........ ప్రభువా, నీ కిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యిచాపి వానిని ముట్టి, నాకిష్టమే, నీవు శుద్ధుడవుకమ్ము అని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను (మత్తయి 8:2-4). మరియొకసారియేసు యెరూషలేమునకు ప్రయాణమై పోవుచుండగా పదిమంది కుష్ఠరోగులు ఆయనకు ఎదురుగా వచ్చి దూరమున నిలిచి యేసుప్రభువా, మమ్ము కరుణించుమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి, మీరు వెళ్ళి మిమ్మును యాజకులకు కనుపరచుకొనుడని వారితో చెప్పెను. వారు వెళ్ళుచుండగా శుద్ధులైరి. వారిలో ఒకడు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్దముతో దేవుని మహిమ పరచుచు యేసు పాదముల యొద్ద సాగిలపడి ఆయనకు కృతజ్ఞతా స్తుతులు

చెల్లించెను (లూకా 17:11-19).

**మృతులను లేపెను**

యేసు మార్గమున వెళ్ళుచుండగా పుట్టు గ్రుడ్డియైన ఒక మనుష్యుడు కనబడెను. యేసు నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురద చేసి, వాని కన్నుల మీద ఆ బురద పూసి, నీవు సిలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగు కొనుమని చెప్పెను. వాడు వెళ్ళి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను. అతడు చూపు పొంది దేవుని మహిమ పరచెను. యేసు దేవుని యొద్ద నుండి వచ్చిన వాడని లోకమునకు నిర్భయముగా సాక్ష్యమిచ్చెను (యోహాను 9వ అధ్యా). యేసు యెరికో పట్టణము వెళ్లుచుండగా త్రోవ ప్రక్కన కూర్చున్న యిద్దరు గ్రుడ్డివారు ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని కేకలు వేసిరి. కాబట్టి యేసు కనికరపడి వారి కన్నులు ముట్టెను; వెంటనే వారు దృష్టి పొంది ఆయన వెంట వెళ్లిరి (మత్త 20:29-34). ఒకసారి సమాజ మందిరపు అధికారి యాయీరను నతడు యేసునొద్దకు వచ్చి, నా కుమార్తె యిప్పుడే చనిపోయినది. అయినను నీవు వచ్చి నీ చెయ్యి ఆమె మీద ఉంచుము; ఆమె బ్రతుకుననెను. యేసు అతని యింటికి వెళ్లి ఆమె చెయ్యి పట్టుకొని చిన్నదానా, లెమ్మని చెప్పగానే ఆ చిన్నది లేచి నడపసాగెను. ఆమె 12 సం॥లు ప్రాయము గలది. ఇది చూచి జనసమూహములు బహుగా విస్మయమొందిరి (మత్త 9:18-19,23-26; మార్కు 4:21-24, 35-42). యేసు నాయీనను ఒక ఊరికి వెళ్లుచుండగా, ఆ ఊరి గవిని యొద్దకు వచ్చినప్పుడు చనిపోయిన యొకడు వెలుపలికి కొని పోబడుచుండెను. ఆయన ఆ శవమును నిలిపి చిన్నవాడా లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయినవాడు లేచి కూర్చుండి మాటలాడ సాగెను. ఇది చూచి అందరు భయాక్రాంతులై దేవుడు తన ప్రజలకు దర్శన మనుగ్రహించి యున్నాడని దేవుని మహిమ పరచిరి (లూకా 7:11-16). యేసు మిత్రుడగు లాజరు అనునతడు బేతనియ యను గ్రామములో చనిపోయెను. అతడదివరకే నాలుగు దినములు సమాధిలో యుండెనని యేసు ఎరిగినను యేసు అతని సమాధి పైనున్న రాయిని పొర్లింపజేసి, లాజరూ, బయటికి

రమ్మని బిగ్గరగా చెప్పెను. వెంటనే చనిపోయిన లాజరు కాళ్ళు, చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను. ఆయన చేసిన ఈ మహాత్కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి (యోహా 11:1-46).

**సముద్రమును గద్దించెను**

యేసు తన శిష్యులతో కలిసి ఒక దోనెలో ప్రయాణము చేయుచుండెను. ఆయన నిద్రించుచుండగా సముద్రము మీద తుఫాను లేచినందున, ప్రభువా నశించి పోవుచున్నాము. మమ్మును రక్షించుమని చెప్పి శిష్యులు ఆయనను లేపిరి. ఆయన లేచి గాలినీ, సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను. ఆ మనుష్యులు ఆశ్చర్యపడి - ఈయన యెట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి (మత్త 8:23-27). యేసు ఒకసారి సముద్రము మీద నడచుచు తన శిష్యులు ప్రయాణము చేయుచున్న దోనె యొద్దకు వెళ్ళెను (మార్కు 6:48-56).

యేసు ఒకసారి అయిదు రొట్టెలు రెండు చేపలతో అయిదు వేలకంటె ఎక్కువమందికి సంతృప్తిగా ఆహారము పెట్టెను (మార్కు 6౦36-44). మరియొక సారి యేడు రొట్టెలు, కొన్ని చిన్నచేపలతో ఆయన నాలుగు వేలమంది కంటె ఎక్కువ మందికి ఆహారము పెట్టెను (మార్కు 8:1-9).

యేసుక్రీస్తు చేసిన అనేక అద్భుతములను గూర్చి మనము చెప్పుకొవలెనన్న మన జీవితమంతయును వెచ్చించినను సమయము చాలదు. యేసేక్రీస్తని, ఆయనే దేవుని కుమారుడని మనము నమ్మునట్లు ఆయన ఈ అద్భుతకార్యములను ప్రజలయెదుట చేసెను. ఈనాడు మనము యేసునందు విశ్వాసముంచవలెనంటే అద్భుతములను చూడనవుసరములేదు. యేసు చేసిన అద్భుతములను గూర్చి మనము ఆయన గ్రంధమందు చదువుట వలనను, వాటిని గూర్చి వినుట వలనను మనము ఆయనయందు విశ్వాసముంచ వలెనని ఆయన కోరుచున్నాడు. అందుకే చూచి నమ్మినవారికంటె చూడక నమ్మినవారు ధన్యులని ఆయన చెప్పుచున్నారు

(యోహాను 20:29). యేసు చేసిన అద్భుతములు, సూచకక్రియలు, మహోత్కార్యములన్నియును బైబిలునందు వ్రాయబడలేదు. అందులో కొన్ని మాత్రమే వ్రాయబడెను. అందుకే భక్తుడైన యోహాను ఇట్లనుచున్నాడు: "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను.... యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్టును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను'' (యోహాను 20:30-31).

ప్రపంచ చరిత్రలో యేసులాంటి మానవుడెన్నడు ఉద్భవించలేదు. ఆయన సత్యమును పల్కెను. సత్యమునే జీవించెను. యేసు తప్పయెవడు కన్య గర్భమున బుట్టెను? దేవుని కుమారుడు తప్ప యెవడు ప్రవచనములను సంపూర్తిగ నెర వేర్చగలడు? దేవుడు తప్ప యెవడు రోగులను అద్భుత రీతిగ బాగుచేయగలడు? యెవడు చనిపోయిన శవములకు ప్రాణము తిరిగిపోయగలడు? ప్రకృతి కర్తయైన దేవునికి తప్ప ప్రకృతి... సముద్రము, తుఫాను, నీరు మొదలగునవి మరియెవనికి లోబడును? మాయ మంత్రములతో యేసు ఈ లోకమునకు రాలేదు గాని, ఆయన దేవుడైయుండి సర్వశక్తితో మనమధ్య ఉద్భవించెను. ప్రపంచ చరిత్రను, మానవుల అధోగతిని మార్చినవాడు యేసుక్రీస్తే. ఆయనే దైవ మానవుడు, మానవుల దేవుడు. నీవు ఆయన యందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, యేసే దేవుని కుమారుడని నీ నోటితో ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల.... ఆయనను బట్టియే నీవు రక్షింపబడుదువని జ్ఞాపకముంచుకొనుము. "కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" అని దైవవేదము ఈ రోజు కూడ నిన్ను హెచ్చరించుచున్నది (యోహాను 3:36). గనుక నీవు ఆలస్యము చేయవద్దు.

# సంఘముకొరకై క్రీస్తు తిరిగి వచ్చుట

## (Christ's Return for the Church)

ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితము క్రీస్తు వచ్చెను. ఆయన ఇంచుమించు 30 సంవత్సరములపాటు ఈ లోకములో జీవించినను, ప్రపంచ చరిత్రను అంతటిని ఆయన మార్చివేసెను. ఈలోక పాపముల నిమిత్తము ఆయనసిలువపై మరణించుట ఆయన సల్పిన కృషికి కిరీటమాయెను. ఆయన సమాధి చేయబడి పునరుత్థానుడైన తరువాత పరమందున్న తన తండ్రి యొద్దకు ఆరోహణుడాయెను. అదిమాత్రమే కాదు. ఒక దినమందు ఆయన మరల రాబోవుచున్నాడు. ఆ సమయమందు ఆయన తన సంఘమును తీసుకొనిపోవును.

ఈ పాఠములో సంఘమును తనయొద్దకు తీసుకొనివెళ్ళు నిమిత్తము క్రీస్తు మరల వచ్చు సంగతిగూర్చి తెలిసికొందము. యేసు వెళ్ళిపోకముందు, తన శిష్యులతో ఇట్లనెను: "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి, నా తండ్రియింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను; నేను వెళ్ళి మీకుస్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" (యోహాను 14:1-3). ఆయన తిరిగివచ్చునని క్రీస్తుమాత్రమేగాక, క్రొత్తనిబంధన లేఖకులు అనేకులు అది యదార్థమని వ్రాసియుండిరి. లూకా, ఆయన పరలోకమున కెక్కిపోవుటను వర్ణించుచు ఇట్లు వ్రాసెను: "ఆయన వెళ్లుచుండగా వారు ఆకాశమువైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలచి-గలిలయ మనుష్యులారా, మీరెందుకునిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన ఈ యేసే ఏ రీతిగా వెళ్లుట మీరు చూచితిరో, ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొ.కా. 1:10-11).

పౌలు ఇట్లు వ్రాసెను: “సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టము లేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు, ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి” (1 థెస్స 4:13–18).

మన ప్రభువు తిరిగి వచ్చునప్పుడు ఏమిజరుగునో పేతురు మనకు ఇట్లు తెలియుజేయుచున్నాడు: “అయితే ప్రభువుదినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును. భూమియు, దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవు నట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో ఆపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశము కొరకును, క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము; వాటియందు నీతి నివసించును” (2 పేతురు 3:10–13).

పెండ్లికుమార్తెయైన తన సంఘముకొరకు ప్రభువు వచ్చునప్పుడు జరుగు సంగతులలో కొన్నిటినిగూర్చి పౌలు ఇట్లు వ్రాసెను: “క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున

పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తు శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతివిషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలెక్రీస్తుకూడ సంఘమును ప్రేమించి అదికళంకమైనను, ముడతయైనను, అట్టిది మరియేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుటదానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:23-27). సంఘమే రాజ్యమని యెంచి దానికొరకై ప్రభువు వచ్చునప్పుడు జరుగు సంగతిని అతడిట్లు మరల వ్రాసెను: "ఇప్పుడైతేనిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన వరుసలోనే బ్రతికింపబడును; ప్రథమఫలము క్రీస్తు తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రతికింపబడుదురు. అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (1 కొరింధి 15:20-24).

సంఘము క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెయైయున్నదను సంగతిని మరొకమారు ఆలోచింతము. ఒక స్త్రీ, తన భర్త చనిపోయినయెడల వేరొక పురుషుని వివాహము చేసికొనవచ్చునని పౌలు చూపించిన తరువాత, ధర్మశాస్త్రము గతించి పోయెను గనుక మనము క్రీస్తు అను వేరొకని చేరుటకై స్వతంత్రులమైతిమి యని అతడు బోధించెను (రోమా 7:1-4). గనుక క్రీస్తునకు వివాహము చేయబడిన మనము (అనగా సంఘము) ఆయన పెండ్లికుమార్తెయైయున్నాము. మత్తయి 25వ అధ్యాయములో క్రీస్తు పదిమంది కన్యకలను గూర్చియు, పెండ్లికుమారుని రాకడను గూర్చియు ఒక

ఉపమానమును బోధించెను. పదినుండి కన్యకలు పెండ్లికుమార్తెను సూచించుచున్నారు. పెండ్లికుమారుడు క్రీస్తే. పెండ్లియాడుటకు ఆయన వచ్చుచున్నట్లు అక్కడ వర్ణించబడినది. ఆయన వచ్చినప్పుడు పెండ్లికుమార్తె ఆయనయొద్ద ఉండుటకై అవెను కొనిపోవును. బాప్తిస్మమిచ్చు యోహాను ఇట్లు చెప్పెను: "పెండ్లికుమార్తె గలవాడు పెండ్లికుమారుడు; అయితే నిలువబడి పెండ్లికుమారుని స్వరము వినెడి స్నేహితుడు ఆ పెండ్లికుమారుని స్వరమువిని మిక్కిలి సంతోషించును; ఈ నా సంతోషము పరిపూర్ణమైయున్నది" (యోహాను 3:29).

తన పెండ్లికుమార్తెయైన సంఘము కొరకు క్రీస్తు తిరిగి వచ్చుటను ఆలోచించుము. ఆయన ఏమి కనుగొనగోరును? ఆయన నామమును ధరించి పవిత్రముగా ఆమె యుండవలెనని ఆయన కోరును. ఆయన ఒకే పెండ్లికుమార్తె దగ్గరకు అనగా ఒకే సంఘముయొద్దకు వచ్చును. ఇది సత్యమే అయిన యెడల నీవు, నేను ఆయన సంఘ సభ్యులము కానియెడల ఏమగును? మనకేమి జరుగును? అయితే ఆయన సంఘములో యుండవలెనన్న ఒకే ఒక్కమార్గమున్నది. అదేమనగా ప్రభువునకు లోబడి ఆయన సంఘముతో చేర్చబడుటయే (మార్కు 16:16;అపొ.కా. 2:47). ఆయనకు విధేయులు కానివారిని గూర్చి పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకులోబడనివారికిని ప్రతిదండన చేయునపుడు మిమ్మును శ్రమపరుచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు, ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారద్రోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి" (2 థెస్స 1:7-10).

క్రీస్తు మరల వచ్చినప్పుడు రాజ్యమునుగూర్చి దైవవేదము ఇట్లు

చెప్పుచున్నది: "మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడుపు పండ్లుకొరుకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యమలో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గలవాడు వినును గాక" (మత్తయి 13:41-43). తీర్పు దినమును ఆయన నీతిమంతులను, అనీతిమంతులను వేరు చేయనపుడు ఏమి జరుగునో మత్తయి 25:31-46లో వ్రాయబడియున్నది. "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి, నా తండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలు కొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" అని చెప్పును (మత్తయి 25:33). అప్పుడు మనము ఇంతకుముందు చదివిన రీతిగ క్రీస్తు తన రాజ్యమును తండ్రికి అప్పగించును (1 కొరింథి 15:24).

ఇక్కడ చెప్పబడిన రాజ్యము, సంఘమే (మత్తయి 16:18,19). అది స్థాపించబడకముందు మత్తయి, మార్కు లూకా, యోహాను సువార్తలలో పరలోకరాజ్యము అని పిలువబడెను. పరలోకమునుండి క్రీస్తువచ్చి దానిని స్థాపించును గనుక అది అట్లు పిలువబడెను. ఆయన వాగ్దానము చేసినరీతిగ అది అపొ.కా. 2వ అధ్యాయములో స్థాపించబడెను (యెషయా 2:2,3; యోవేలు 2:28,29; దానియేలు 2:4). అప్పటినుండి అది స్థాపించబడియున్నట్లు లేఖనములలో చెప్పబడెను (కొలస్స 1:13; హెబ్రీ 12:26; యాకోబు 2:5; 2 పేతురు 1:11). దానిపై క్రీస్తే రాజు, దానికి ఆయన శిరస్సు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22,23). దాని పౌరులే సంఘ సభ్యులు.

ఆయన ప్రజలతో సమకూడిన రాజ్యముకొరకు తన ఒకే ఒక్క రాజ్యముకొరకు క్రీస్తు తిరిగి వచ్చుచున్నాడు. ఆ రాజ్య పౌరులు ఆయన నామమును ధరించుకొని ఆయన ఆజ్ఞలకు లోబడుటద్వారా ఆయనను గౌరవింతురు. నీవు ఆయన రాజ్య పౌరుడవా" నీవు ప్రభువు సంఘ సభ్యుడవా? కానియెడల ప్రభువు నీ కొరకు వచ్చుటలేదు. అంటే నీవు నిత్య నాశనము కొరకు విడిచి పెట్టబడుదువు.

క్రీస్తు మరల ఎప్పుడు వచ్చును? మనకు తెలియదు. ఆయన ఈరోజుగాని, రేపుగాని లేక కొన్ని వేల సంవత్సరముల తరువాతగాని రావచ్చును. ఆయన ఎప్పుడు వచ్చునో మనకు గాని, మరియే మానవునికిగాని తెలియదు. దేవదూతలకుగాని చివరకు క్రీస్తుకుగాని అది తెలియదు. దేవుడు ఒక్కడు మాత్రమే ఎరుగును. క్రీస్తు ఇట్లు చెప్పెను: "అయితే ఆ దినమును గూర్చియు, ఆ ఘడియనుగూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మత్తయి 24:36). గనుక నీవు, నేను ఎల్లప్పుడు సిద్ధపడియుండుట అతి ప్రాముఖ్యము. బైబిలు చెప్పు రీతిగ మనము సిద్ధపడియున్న యెడల క్రీస్తు వచ్చినప్పుడు ఆయన మనలను తనయొద్దకు కొనిపోవును. అట్లే ఆయన తన రాజ్యపౌరులైన సంఘమునుగూడ కొనిపోవును.

-జె. సి. ఛోట

## బైబిలు సర్వే

## యేసు క్రీస్తు - ఆయన జననము - బాప్తిస్మము

ప్రపంచములో ఇంతవరకు జీవించినవారిలో అత్యద్భుతమైన మహావ్యక్తినిగూర్చి మనము నేర్చుకొందము. యేసుక్రీస్తు కేవలము మానవుడు మాత్రమే కాదు. ఆయన దేవుని కుమారుడు. ఆయన మానవ రూపియై జన్మించిన విధానమును నాల్గు సువార్తలయందును తెలియపర్చబడినది కేవలము సువార్తలయందు మాత్రమే కాదు గాని మొత్తము బైబిలు గ్రంథమంతయు ఆయనను కేంద్రముగా చేసికొని వ్రాసిన గ్రంథమే. బైబిలునందలి మొదటి గ్రంథమైన ఆదికాండమునందు అబ్రహాముకు నీ సంతానముద్వారా భూదియంతయు ఆశీర్వదింపబడునని చేసిన వాగ్దానము క్రీస్తునందు నెరవేరెను. గత పాఠమునందు మనము ప్రవక్తలందరు కూడా మెస్సయను గూర్చి ప్రవచించుట జూచితిమి. ఇంకను మనము రాబోవు పాఠములందు క్రొత్త నిబంధన యంతటిలో క్రీస్తును గూర్చియు ఆయన బోధలను గూర్చియు ఆయన సంఘమును గూర్చియు విపులముగా తెలిసికొనగలము.

నాల్గుసువార్తలు నాలుగువిధములుగా క్రీస్తు జీవిత చరిత్రను తెల్పుచున్నవి. కొన్నికొన్ని సంఘటనల మాత్రము ఒక దానిలో లేనివి మరియొకటి వ్రాసిరి. మత్తయి తన సువార్తయందు యేసు ప్రవక్తల ద్వారా వాగ్దానము చేయబడిన మెస్సయ అని నిరూపించెను. ఆ విధముగా ప్రవచనములనుండి వాక్యమును ఎత్తి చూపించెను. మార్కు తన సువార్తయందు క్రీస్తు బోధలకన్న ఆయన చేసియున్న కార్యములను నొక్కి చెప్పెను. లూకా తన సువార్తయందు క్రీస్తు మానవునిగా మానవునియొక్క శ్రమలను అనుభవించుటనుగూర్చి వక్కాణించెను. యోహాను క్రీస్తుయొక్క దైవత్వమును నిరూపించుటనుగూర్చి వ్రాసెను. యోహాను 20:31 నందు "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఈ సంగతులు వ్రాయుచున్నానని" చెప్పెను.

**బాప్తిస్మమిచ్చు యోహాను**

బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తునుగూర్చి దారి సరాళముచేయు వ్యక్తిగా మనము చూచుచున్నాము. ఈయన సువార్తికుడును, అపొస్తలుడును అగు యోహానుమాత్రము గాదని మనము గ్రహింపవలెను. ఆయన బాప్తిస్మము నిచ్చుటవలన బాప్తిస్మ మిచ్చు యోహానని పేరు నొందెను. యెషయ ప్రవచించిన రీతిగా ప్రభువు మార్గమును సరాళము చేయు వ్యక్తిగా ఈయన వచ్చెను. (మత్తయి 3:3) యోహాను ఒక అసాధారణ వ్యక్తి. ప్రత్యేకమైన ఒంటె రోమములు వస్త్రమును ధరించుకొని అడవి తేనె మిడతలు ఆహారముగా భుజించువాడు. ఆయన అరణ్యములో బోధించుచు యొర్దాను నదిలో ఆయన యొద్దకు వచ్చు వారికి బాప్తిస్మమిచ్చెడివాడు. తాను క్రీస్తు కాదని జనసమూహములకు అతడు చెప్పెను. తన వెనుకవచ్చు వానియందు నిరీక్షణ యుంచవలెనని గోరెను. ఆదినములలోగల ప్రజల పాపమును నిర్భయముగా ఖండించి మారుమనస్సు పొందవలెనని చెప్పెను. అతడు తన సేవ యొక్క ఉన్నతదశలో ప్రభువునకు యొర్దానునదిలో బాప్తిస్మమిచ్చెను. తరువాత క్రమేణ ప్రజలలో అతని ప్రభావము తగ్గిపోయెను తరువాత అతడు హేరోదుద్వారా బంధింపబడి చెరసాలయందు తల ఖండింపబడి చంపబడెను. ఇంతటి గొప్ప వ్యక్తినుద్దేశించి మత్తయి 11:11లో

ప్రభువు ఈలాగు చెప్పుచున్నాడు: "స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహానుకంటె గొప్పవాడు పుట్టలేదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. అయినను, పరలోక రాజ్యములో అల్పుడైనవాడు అతనికంటే గొప్పవాడు". కనుక ప్రభువు యొక్క సంఘము బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా కట్టబడలేదు గాని లోక రక్షకుడైన క్రీస్తుద్వారా కట్టబడినది.

**శాశ్వతవాసియైన క్రీస్తు**

దేవుని కుమారుడు ఆదియందు తండ్రితో ఉండెను. యోహాను 1:1లో ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. యోహాను 1:14 నుండి 17 వరకు పరిశీలించిన ఈ వాక్యమే యేసుక్రీస్తని గ్రహించగలము. కనుకనే ఆదికాండము 1:26లో మన పోలిక చొప్పున మానవులను సృజించుదమని తండ్రి చెప్పినపుడు క్రీస్తుకూడా ఆయనతో యున్నట్లు గ్రహించగలము.

దేవుని ఏకైక కుమారుడైన క్రీస్తు లోకమును పాపమునుండి రక్షించుటకు భూమిమీదకు పంపబడెను.

**క్రీస్తు జననము**

యేసు క్రీ.శ. 4 సంవత్సరములకు ముందు జన్మించెను. మనము ఇప్పుడు లెక్కించుచున్న క్రీస్తుశకము చరిత్రకారులు కొంచెము తప్పుగా లెక్కించుటవలన ఈ భేద మేర్పడినది అనగా క్రీస్తు పుట్టిన సంవత్సరము (శకారంభము 4సం॥ముందునుండి లెక్కించవలసియున్నది). ఆయన తల్లి కన్య మరియ. దేవునియొక్క పరిశుద్ధాత్మ ద్వారా ఆయనను గర్భము ధరించినది కనుక ఈయన దేవుడైయుండిన మానవుడు. స్త్రీ ద్వారా జన్మించినందున మానవుడు, దేవునిద్వారా పుట్టినందున దైవము అయిఉన్నాడు. మానవవంశావళిబట్టి రాజవంశీకుడైన దావీదు వంశమునందు జన్మించెను. దావీదువలె లోక సంబంధమైన రాజ్యమును స్థాపించెను. మీకా 5:2 నందు ప్రవచింపబడినరీతిగా ఈయన బెత్లెహేమునందు పరిస్థితుల ప్రభావమునుబట్టి జన్మించెను.

రోమా చక్రవర్తి శాశించినదానిబట్టి మరియు ఆమె భర్తయైన యోసేపు తమ స్వగ్రామమైన బెత్లెహేమునకు జనాభాలెక్క వ్రాయించుకొనుటకు వెళ్ళిరి. వారక్కడకు వచ్చినపుడు సత్రములో స్థలములేనందున పశులపాకలో యుండిరి. ఈపాకయందే అతి దీనునిగా క్రీస్తు జన్మించి పొత్తిగుడ్డలతో చుట్టబడి

పశువుల తొట్టిలో పెట్టబడి ఆరాధించబడెను. దేవదూతలు ఈయన జననముగూర్చి పొలములో గొఱ్ఱెలను కాచుకొనుచున్న గొఱ్ఱెల కాపరులకు తెలియపరచిన తక్షణమే వారు ప్రభువునొద్దకు వచ్చి ఆరాధించిరి. తరువాత తూర్పుదేశపు జ్ఞానులు నక్షత్రమును వెంబడించి ప్రభువును ఆరాధించుటకు బయలుదేరి ఖచ్చితమైన స్థలముకొరకు మార్గమధ్యమున హేరోదు రాజును సంప్రదించగా ఆయన వేరొకరాజు జననమువలన తనకు రాజ్యభ్రష్టత్వము సంభవించునేమోయని మిక్కిలి భయపడి రెండు సం॥వయస్సు గల చిన్న బిడ్డల నందరిని చంప నాజ్ఞాపించెను ఏమైనప్పటికి జ్ఞానులు ప్రభువును కనుగొని ఆయనను ఆరాధించిరి. అనేకమంది నమ్ముచున్నట్లుగా జ్ఞానుల సంఖ్య ముగ్గురుమాత్రము కాదు. హేరోదు ప్రభువును చంపించుటలో విజయుడు కాలేకపోయెను. కారణ మేమనగ యోసేపునకు దర్శనమందు దేవుడు హేరోదు శిశువును చంపనైయున్నాడని తెల్పి తప్పించుకొనుటకు ఈజిప్టు పారిపొమ్మని తెల్పెను.

**ఆయన బాల్యము**

యోసేపు ఆయన కుటుంబము హేరోదు మరణ మగువరకు వీరు ఈజిప్టునందు నివసించిరి. వారు తిరిగివచ్చిన తరువాత యూదా నందలి బెత్లెహేములో కాపురముండక గలిలయలోని నజరేతునందు కాపురముండిరి. ఈ గలిలయ పాలస్తీనదేశమందు ఉత్తరభాగమందుగలదు. యూదాకు గలిలయకు మధ్య సమరయ అను ప్రదేశము గలదు. యేసుయొక్క బాల్యము నజరేతునందు గడిచెను. అక్కడనే ఆయన వడ్రంగమును నేర్చుకొనెను. ఆయన తన పన్నెండవయేట యెరూషలేమునకు తలిదండ్రులతో వెళ్ళినపుడు దేవాలయమునందు శాస్త్రులు పరిసయ్యులతో ఉండిపోయినందున యోసేపు మరియలకు ఆయనను కనుగొనుటకష్టమాయెను. ఆయన బాల్యవిషయములు ఇంతకు మించి మనకు యేమియు తెలియవు. లూకా 2:52 "యేసు జ్ఞానమునందును వయస్సునందును మానవుల దయయందును దేవుని దయయందును వర్ధిల్లు చుండెను."

### ఆయన బాప్తిస్మము

యేసు తన ముప్పదియన యేట యొర్దానదియందు బాప్తిస్మమిచ్చు యోహానుద్వారా బాప్తిస్మము పొందెను. పాపరహితుడైన క్రీస్తునకు బాప్తిస్మమిచ్చుటకు యోహాను నిరాకరించెనుగాని "నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని యేసు చెప్పెను" (మత్తయి 3:15). క్రీస్తునకు పాపము లేదుగాబట్టి పాపక్షమాపణ నిమిత్తమై బాప్తిస్మమాయన పొందలేదు. పెంతెకోస్తుదినమున పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవారిని మనము చూడగలము అపో. కా. 2:38. కొన్ని కొన్ని చిత్రములయందు చిత్రకారుడు బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువు తలపై నీళ్ళు చల్లుచుండునట్లు చూడగలము. ఇది యదార్థము గాదు మత్తయి 3:16, మార్కు 1:10 యందు చూచిన యోహాను ప్రభువు నీటిలో మునిగినట్లుగా మనము చూడగలము. యేసు నీళ్ళలో నుండి బైటకు వచ్చినపుడు దేవుని ఆత్మ పావురమువలె ఆయనపై దిగెను. ఆకాశమునుండి ఒక స్వరము ఈవిధముగా పలికెను. మార్కు 1:11 "నీవు నాప్రియ కుమారుడవు నీయందు నేను ఆనందించుచున్నాను". ఈ విధముగా దేవుడు క్రీస్తు దైవమైన తన కుమారుడని ప్రకటించెను.

### క్రీస్తు పరిచర్య ప్రారంభము

బాప్తిస్మమైన తరువాత క్రీస్తు అరణ్యములలోనికి కొనిపోబడెను. అచట 40 దినములు ఉపవాసముండెను. ఉపవాసానంతరము సాతాను అనేక విధములుగా ఆయనను శోధించెను. కాని ప్రభువు లొంగి పాపము చేయలేదు. కనుక నిర్దోషమైనవానిగా మానవుల పాపమును తీసివేయుటకు సిలువపై బలి యగుటకు సిద్ధమాయెను. తరువాత గలిలయలోని కానాయందు వివాహ సమయమున నీళ్ళను ద్రాక్షారసముగా మార్చిన సూచకక్రియ ద్వారా మొట్టమొదటగా అనేకులను తనవైపునకు ఆకర్షించెను. వెనువెంటనే అనేక సూచకక్రియలను ఆయన చేసెను. అటుపైన గలిలయ సముద్రతీరమందలి కపెర్నహూము పట్టణమునకు తన స్థావరము మార్చుకొని దానిని కేంద్రముగా చేసికొని తన సేవ కొనసాగించెను. దానిని గూర్చి విపులముగా తరువాతి పాఠములందు నేర్చుకొనగలము.

# బబులోను పతన గీతము

## (The Doom song of Babylon)

**పరిచయము:**

ప్రకటన 17లో బబులోను మహావేశ్యయని వర్ణించబడెను. 18వ అధ్యాయములో అదొక మహా పట్టణమని వర్ణించబడెను. 18వ అధ్యాయములో బబులోను యొక్క నాశనం వర్ణించబడెను.

బబులోను సముద్రమునుండి వచ్చు క్రూరమృగముతో పోల్చబడెను. అది దేవుని ప్రజలను హింసించు ప్రభుత్వములని గమనించాము. అది ఒక మహావేశ్య, అనగా ప్రజలను మోహించి నాశనము చేయు శక్తి. బబులోను ఐహిక సుఖము ధనభోగముతో పోల్చబడెను. (యెష 47:8)

**పతనగీతము (18:1-3)**

"మహాబబులోను కూలిపోయెను కూలిపోయెను"

-17వ అధ్యాయములో ఈ మహాబబులోను ధూమ్ర రక్తవర్ణముగల వస్త్రమును ధరించుకొని బంగారము, రత్నములు, ముత్యములతో అలంకరింపబడి సమస్తవైభవములు అనుభవించుచున్నట్లు వర్ణించబడెను.

-గాని అది కూలిపోయెను, కూలిపోయెను, దానిపతనగీతము పాతనిబంధనలో యున్నబబులోను పతనమును గుర్తుచేయును.

-బబులోను మీదపడుటకు నేను మాదీయులను రేపెదనని దేవుడు చెప్పెను (యెషయా 13:17). అదిసొదొమ గొమొర్రాలవలెనగును (యిర్మి 49:18).

-యెషయా 21,47, యిర్మియా 50,51 అధ్యాయములు చూడుము.

-నిజంగా మొదటి శతాబ్దపు బబులోనైన రోమా పట్టణము, రోమా సామ్రాజ్యము జనములకు మత్తెక్కించింది.

-సమస్తజనములుమోహోద్రేకముతో కూడిన దాని వ్యభిచారమద్యమును త్రాగిపడిపోయిరి. భూరాజులు, భూలోక వర్తకులు రోమా యొక్క సుఖభోగములవలన ధనవంతులైరి.

**దేవుడు తన ప్రజలను బయటకు పిలుచుట (18:6-5):**

-"మరియు ఇంకొకస్వరము పరలోకమునుండి చెప్పగా" యోహాను

వినెను.

-"నా ప్రజలారా దానిపాపములో పాలివారు కాకుండునట్లును దాని తెగుళ్లలో ఏదియు మీకు ప్రాప్తింపకుండునట్లును దానిని విడిచి రండి" (4వ)

-దేవుడు లోతును సొదొమ నుండి బయటికి పిలిచెను (ఆదికా 19:12-14).

-ఆయన బబులోను నుండి యూదులను బయటికి పిలిచెను (యెషయ 48:20).

-ఈ క్రైస్తవులు రోమా యొక్క పాపములలో పాలిభాగస్థులు కాకుండుటకు దేవుడు వారిని పిలిచెను.

1. మనం లోకంలో యున్నాముగాని లోకస్థులము కాము (యోహాను 15:19).

2. మనం దేవునికొరకు ప్రత్యేకముగా యుండుటకు లోకములోనుండి పిలువబడితిమి (2కొరింధీ 6:14-17, 7:1).

-"దాని పాపములు ఆకాశమునంటుచున్నవి" యను సంగతి గమనించుము. యూదుల పాపముల వలె దాని పాపములు గుట్టలు గుట్టలుగా అయ్యేను (రోమా 2:5).

-దేవుడు ప్రతి అతిక్రమమును జ్ఞాపకముంచుకొనును. పాపముకు తగిన శిక్ష విధించును. జీతమిచ్చు రోజు వచ్చుచున్నది (గలతి 6:7-8).

**న్యాయముకైన విజ్ఞాపన : (18:6-8)**

మహావేశ్య యొక్క బహుమానము యిది: "అదియిచ్చిన ప్రకారము దానికి ఇయ్యుడి; దాని క్రియల చొప్పున దానికి రెట్టింపు చేయుడి. అది కలిపిన పాత్రలో రెండంతలు కలిపిపెట్టుడి".

-మనం యేమి విత్తుదుమో దానినే కోస్తాము. ఒక్కోసారి ఎక్కువ కోస్తాము. "దౌష్ట్యమును విత్తువాడు కీడును కోయును" (సామెతలు 22:8). నిజంగా "విశ్వాసఘాతకుల మార్గము కష్టము" (సామెతలు 13:15).

-ఆ తీర్పు తాను చేసిన క్రియలను బట్టియుండును 2కొరింధీ 5:10; రోమా 2:6; ప్రక 22:2

**శిక్షకు కారణములు:**

-రోమా వైభోగముతో జీవించెను. ఐహిక విచారములే దాని గమ్యము. ఈలోక సంబంధ విషయాలతో కప్పుకొనియుండెను.

-రోమా పతనమునకు గర్వము కూడ ఒక కారణమైయుండెను. నాశనమునకు ముందు గర్వము నడుచును (సామెతలు 16:18). సాతానుడు పతనమవడానికి

గర్వమే కారణం (యెషయా 14; యెహెజ్కేలు 28).

-క్రైస్తవులు దీనమనస్సును ధరించుకోవాలి.

-రోమా పట్టణము "నేను రాణినిగా కూర్చుండు దానను, నేను విధవరాలను కాను, దుఃఖమును చూడనే చూడనని" తన మనసులో అనుకొనెను.

-అది ఎంతగా గొప్ప చేసుకొని సుఖ భోగములననుభవించెనో అంత ఘోరముగా పతనమయ్యెను.

**రోమా పతనము యొక్క వేదన మూడంతలు (18:9-19)**

-దాని సుఖ భోగములననుభవించిన రాజులు భయాక్రాంతులై దానిని గూర్చి ఏడ్చుచు రొమ్ముకొట్టు కొందురు (9-11).

-లోకములోని వర్తకులును దానిని గూర్చి ఏడ్చుదురు. నీ ప్రాణమునకు ఇష్టమైనవి నీకు దొరకకుండ పోయినవి. అవియిక మీదట కనబడనే కనబడవని చెప్పుకొనుచు దాని గూర్చి దుఃఖ పడుదురు (11-16వ).

-ప్రతి నావికుడు, ఓడలవారు, సముద్రముమీద పనిచేసి జీవనము చేయు వారందరు దాని దహనమును చూచి యేడ్చుచు, దుఃఖించుదురు. అది ఒక్క గడియలోనే పాడై పోయెనే అని చెప్పుకొనుచు కేకలు వేయుదురు (17-19వ).

**సంతోషపడుటకు పిలుపు: (18:20)**

-ఈ మహావేశ్యయైన రోమా పట్టణము నాశనమవుటవలన పరలోకములోను భూమి మీదను సంతోషము కలిగెను. ముఖ్యముగా పరిశుద్ధులైన క్రైస్తవులకది మహానందము.

-"పరలోకమా, పరిశుద్ధులారా, అపొస్తులారా, ప్రవక్తలారా దాని గూర్చి ఆనందించుడి. ఏలయనగా దాని చేత మీకు కలిగిన తీర్పుకు ప్రతిగా దేవుడు ఆ పట్టణమునకు తీర్పు తీర్చియున్నాడు" (20వ).

-తన పరిశుద్ధులకు కలిగిన హింసలకు దేవుడు ప్రతీకారము చేసియున్నాడు. (హెబ్రీ 2:2-3; 10:31).

**మహా వేగముతో నాశనమైన బబులోను (18:21-24)**

-దేవుడు తాను చెప్పినట్లే రోమా సామ్రాజ్యమును సమూలనాశనం చేసారు. తదుపరి ఆయన ఉగ్రతను ఎదుర్కొనవలసినది రోమా పట్టణమే.

-రోమా సామ్రాజ్య పతనము అతివేగం, హింసాయుక్తం.

సముద్రములో తిరుగటిరాయి వడవేయుబడునట్లు అది పడద్రోయబడెను.

– దానిలో జీవన సూచనలన్ని నాశనమాయెను.

–వినోద కార్యక్రమములన్నియు అంతమాయెను.

–వ్యాపార కార్యక్రమములన్ని స్థంభించి పోయెను.

–గృహ సంబంధ జీవనం గతించి పోయెను.

–రోమా సామ్రాజ్యములో ప్రవక్తల యొక్కయు, పరిశుద్ధులు యొక్కయు భూమిమీద వధింవబడిన వారందరియొక్కయు రక్తము కనబడెను.

–అది రక్తము చిందించెను గనుక ఇప్పుడు దాని రక్తము నది వలె ప్రవహించును.

**ముగింపు:**

పావము వలన నాశనం సంభవిస్తాదనుటకు రోమా సామ్రాజ్యము ఒకగొప్ప ఉదాహరణ. 1యోహాను 2:15-17లో చెవ్వబడిన దానికి అవిధేయులైతే ఏమిసంభవించునో దానికది గురుతు. ఈ లోకమును దాని ఆశయు గతించిపోవును. దేవుని గొర్రె పిల్లను ఎవడు జయించలేడు. ఆయన, ఆయన ప్రజలు సాతానునుఓడించి గెలుస్తారు. న్యాయము చేకూర్చబడతాది. దేవుని దీర్ఘశాంతము అంతమయేసరికి తీర్పు సంభవించును. అది నిశ్చయం!

---

**సత్యవాణి** టి.వి. కార్యక్రమములను

ప్రతి సోమ, మంగళవారాల్లో ఉదయం 6.00 గంటలకు **శుభవార్త** ఛానల్‌లో చూడండి.

ప్రతి శనివారం ఉదయం 6.30 గంటలకు **టి.వి.-5** ఛానల్‌లో చూడండి.

**సత్యసువార్తను వినండి ! విశ్వసించండి !!**

# సంక్షిప్త వార్తలు

2008 జూన్ నెల 18వ తేదీనాడు కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో క్రైస్తవ కుటుంబముల సహవాసకూడిక ఘనముగా జరిగెను. క్రైస్తవ కుటుంబముల యొక్క ప్రాముఖ్యతను క్రైస్తవులు, లోకము కూడ గుర్తించగలుగుటకు ఈ సహవాసకూడిక దోహదమాయెను. ఆరోజు తూర్పుగోదావరి జిల్లాలోని పలు స్థానిక సంఘముల నుండి, భార్య భర్తలు తమ పిల్లలతో సహా అనేకులు హాజరై ఒక గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి.

ఉదయకాలపు కూటములో సోదరులు ఎం. ఆల్‌ఫ్రెడ్ గారు, జాషువాగూటంగారు చక్కటి వాక్యోపదేశము చేసిరి. దేవునికి క్రీస్తులాంటి అనేక కుమారులు కావలెనని, అట్టివారిని తన రాజ్యమైన సంఘము ద్వారా ఆయన తయారు చేయుచున్నారని, ఆయన సంకల్పములో క్రైస్తవ కుటుంబము యొక్క ప్రాముఖ్యత చాలగొప్పదని సోదరులు ఆల్‌ఫ్రెడ్ గారు ఉపదేశించిరి.

క్రైస్తవులు, క్రైస్తవ కుటుంబము యొక్క పలుకుబడి ఈ లోకంలో గొప్పదని, క్రైస్తవ కుటుంబముల వలన ఈ లోకము పరిరక్షింపబడుచున్నదని, వారు ఈ లోకమునకు వెలుగువంటి వారని, ఉప్పువంటి వారని చెబుతూ జాషువాగారు ఉపదేశించిరి.

మధ్యాహ్న కాలమంతయు సోదరులు వి. సుదర్శనరావుగారు క్రైస్తవ దంపతులకు అనేక హెచ్చరికలిస్తూ, అనేక దైనందిన జీవన ఉదాహరణలిస్తు, దేవుని రాజ్యవ్యాప్తి కొరకు కుటుంబ క్షేమముకొరకు, సంఘ క్షేమము కొరకు క్రైస్తవ భార్య యొక్క పాత్ర చాల గొప్పదని వివరించారు. అబ్రాహాము భార్యయైన శారా, నోవహు భార్య, ఎస్తేరు మొదలగు ఆదర్శ స్త్రీల ఉదాహరణలిస్తూ సభికులను రంజింపచేస్తూ దేవుని వాక్య సత్యములను ఆయన అనర్గళంగా బోధించారు. ఆనాడు జరిగిన కూటమును సోదరులు రిక్కీగూటంగారు ఆదినుండి అంతము వరకు సమర్ధవంతంగా నడిపించారు.

జూన్ నెల 24 తేదీనాడు ఉప్పలగుప్తం మండలం వాడపర్రులో సువార్తికుల సదస్సు సోదరులు రిక్కీ గూటం గారి అధ్యక్షతన ఘనంగా జరిగెను. పలు

ప్రాంతముల నుండి క్రీస్తు సంఘ సువార్తికులు ఆ సదస్సుకు హాజరైరి. కొందరు క్రీస్తు సంఘమును ఏల ద్వేషింతురు ? అనే అంశము ఆ రోజ చర్చించబడెను. సోదరులు యస్. యేసురత్నం (కాకినాడ), యన్. మోజెస్ (కరుగోరుమిల్లి), సిహెచ్. జాన్‌బాబు (ముంగండ), ఎం. యేసురాజు (కాట్రేనికోన) తదితరులు పై అంశమును సవిస్తరముగా చర్చించిరి. రిక్కీగూటంగారు కూడ చక్కటి వాక్యోపదేశము గావించిరి. స్థానిక సంఘము హాజరైన వారందరికీ మంచి భోజనము నేర్పాటు చేసిరి. వాడపల్లిలో సోదరులు డి. రంగారావు గారు సువార్త చాటుచున్నారు.

వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్ వాల్యూమ్స్ 12, 13 ఇప్పుడు లభించుచున్నవి. వలయువారు సత్యవాణి ఆఫీసుకు వ్రాసి పొందవచ్చును. సత్యవాణి రేడియో, టివీ, కరస్పాండెన్సు కోర్సు, సత్యవాక్కు మొదలగు పరిచర్యలను మీ ప్రార్ధనలలో జ్ఞాపకముంచుకొనండి. ఈ పరిచర్యల నిమిత్తము సంఘపరముగా గాను, వ్యక్తిగతముగా గాను ఆర్థిక చేయూతనియ్యండి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua [illegible] Printed by him at [illegible] Kakinada - [illegible]